క్లుప్తంగా

గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

గుండాల: గుండాల, కొమరారం పోలీసుస్టేషన్ల పరిధిలో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే కమిటీ బాధ్యులు ముందస్తు అనుమతి తీసుకోవడమే కాక భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సీఐ లోడిగ రవీందర్ సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ముందస్తుగా సంబంధిత గ్రామపంచాయతీతో పాటు విద్యుత్ శాఖ, మైక్ అనుమతులు తీసుకొని ఆయా ప్రతులు, కమిటీ కమిటీ సభ్యుల పేర్లను పోలీసులకు సమర్పించాలని తెలిపారు. అలాగే, రహదారులపై రాకపోకలకు ఇబ్బంది ఎదురుకాకుండా మండపాలు ఏర్పాటు చేసుకుని, వీలైనంత మేర మట్టితో చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు.

జ్వరపీడితులకు పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

చర్ల: మండలంలోని కొత్తపల్లిలో జ్వరాల బారిన పడిన వారి కుటుంబాలను శుక్రవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతోనే జ్వరాల తీవ్రత పెరిగిందని పేర్కొన్నారు. ఇకనైనా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మచ్చా రామారావు, బందెల చంటి, తాళ్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపాడు: మండలంలోని కృష్ణసాగర్ ప్రభుత్వ గురుకుల ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమోహన్ తెలిపారు. ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

భద్రాచలంఅర్బన్: పట్టణానికి చెందిన మందా రాంబాబు జూన్ 2వ తేదీన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో భద్రాచలం టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఆరా తీయగా భద్రాచలంలోనే ఫోన్ లభించింది. ఈ సందర్భంగా రాంబాబుకు శుక్రవారం టౌన్ సీఐ నాగరాజురెడ్డి, ఎస్సై పీవీఎస్.రావు ఫోన్ అందజేశారు.

ఘంటసాల పాటలు, పద్యాలతో గ్రంథం

భద్రాచలంఅర్బన్: శతాబ్దిగాయకుడు ఘంటసాల పాడిన పాటలు, పద్యాలు, లలిత గీతాలను సేకరించి హైదరాబాద్‌కు చెందిన చల్లా సుబ్బారాయుడు కుటుంబీకులు గ్రంథాన్ని రూపొందించారు. దీనిని స్వర సంఘం అధినేత తిరుపతి వెంకటాచలం శుక్రవారం భద్రాచలంలో లయన్స్‌క్లబ్ బాధ్యుడు గోళ్ల భూపతిరావుకు అందజేశారు.

ఏపీజీవీబీ ఆధ్వర్యాన డిపాజిట్ మేళా

దమ్మపేట/ములకలపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యాన డిపాజిట్ మేళా నిర్వహించారు. దమ్మపేట మండలంలోని మందలపల్లి, ములకలపల్లి మండలంలోని సీతాయిగూడెంలో శుక్రవారం నిర్వహించిన మేళాలో డిపాజిట్లు, ప్రమాద బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ ఉదయ్ మాట్లాడుతూ మిగతా బ్యాంకులతో పోలిస్తే డిపాజిట్లపై అధిక వడ్డీ లభిస్తుందని, రూ.20కే రూ.2లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన దమ్మపేట మండలం మందలపల్లి వాసి కుటుంబానికి బీమా చెక్కు అందజేశారు. సర్పంచ్‌లు మడివి దుర్గ, కారం సుధీర్, ఎంపీటీసీ అజయ్‌కుమార్, బ్యాంకు అధికారులు సునీల్, రామకృష్ణారెడ్డి, కృష్ణ, సీహెచ్.నరేశ్, రాంరెడ్డి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష

బూర్గంపాడు: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్షగా నిలుస్తాయని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత తెలిపారు. మండలంలోని ఉప్పుసాకలో చేపట్టిన పల్లెబాట కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు, బీసీ బంధు, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ తదితర పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనంగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొనకంచి శ్రీనివాస్, గోనెల నాని, తుపాకుల రవి, దారా కార్తీక్, చుక్కపల్లి బాలాజీ, దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం సరికాదు..

అశ్వాపురం: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెకు దిగితే ప్రభుత్వం నిర్బంధం విధించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా అన్నారు. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరగా అశ్వాపురంలోని దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. బలవంతంగా కేంద్రాల తాళాలు తెరిపించడం గర్హనీయమని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన అధికారులు ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల అసోసియేషన్, సీపీఐ నాయకులు కోరెం శ్రీలత, హంసవేణి, సాహితి, రాయల భారతి, కళావతి, సుశీల, కమటం వెంకటేశ్వరరావు, రేసు ఎల్లయ్య, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్‌సాయి, నాగేంద్రబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే, దీక్ష శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్ రెడ్డి, నాయకులు షర్ఫియుద్దీన్, కమటం నరేష్, ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, తెల్లం వీరభద్రం, సత్యనారాయణరెడ్డి, బొబ్బాల నాగేష్, నాయకులు పాల్గొన్నారు.


అశ్వాపురం : అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ టీచర్లకు కనీసం రూ.26వేల వేతనం చెల్లించడమే కాక ఇతర సమస్యలు పరిష్కరంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. భద్రాచలంలోని అంగన్‌వాడీల దీక్షను వారు ప్రారంభించి మాట్లాడారు. కనీస వేతనాలు చెల్లించడమే కాక పర్మినెంట్ చేయాలని కోరారు. నాయకులు మర్లపాటి రేణుక, భీమవరపు వెంకటరెడ్డి, ఎస్.నాగరాజు, ముత్తయ్య, మారెడ్డి శివాజీ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంఅర్బన్: దీక్షను ప్రారంభిస్తున్న నాయకులు

కేసీఆర్‌తోనే భద్రాద్రి అభివృద్ధి సాధ్యం

భద్రాచలం: భద్రాచలం అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేశారని బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ తెలిపారు. నిధులు విడుదల చేసిన నేపథ్యాన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అరికెల తిరుపతిరావు ఆధ్వర్యాన శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ నిధుల విడుదలకు సహకరించిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మంత్రులు అజయ్‌కుమార్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే కరకట్ట పొడిగింపునకు నిధులు విడుదల చేస్తానని సీఎం హామీ ఇచ్చారని.. బీఆర్‌తోనే భద్రాచలం అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్ల రవికుమార్, చింతాడ రామకృష్ణ, లకావత్ వెంకటేశ్వర్లు, రాంబాబు, నారా రాము, చింతాడ చిట్టిబాబు, రత్నం రమాకాంత్, ఎం.డీ.నవాబ్, బంబోతు రాజీవ్, మల్లెల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో...

దుమ్ముగూడెం: అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుతో తెలంగాణను అగ్రగామిగా నిలిపిన కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.50కోట్లు కేటాయించిన సందర్భంగా శుక్రవారం దుమ్ముగూడెంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయగా బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి మాట్లాడారు. నాయకులు జానీపాషా, తునికి కామేష్, కెల్లా శేఖర్, కణితి లక్ష్మణ్, జంజూరి జయసింహ, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, సర్పంచ్‌లు తెల్లం రామకృష్ణ, సోడి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వెంకట్రావ్

చర్లలో...

చర్ల రూరల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి చర్లలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల రహదారుల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేసిన నేపథ్యాన స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి పోలిన లంకరాజు, గొమ్ముగూడెం సర్పంచ్ పొడియం మురళితో పాటు నాయకులు ఐనవోలు పవన్, దొడ్డి సూరిబాబు, తోటపల్లి మాధవరావు, కాకి అనిల్, తుర్రం రవి, ఆలం ఈశ్వర్, దొడ్డి తాతారావు, ఎడ్ల రామదాసు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు

దమ్మపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగియగా ఎమ్మెల్యే బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని సూచించారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ కీసర లక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు దారా యుగేందర్, దారా మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు


శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ షామిని

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యాన చెన్నాపురం, చెన్నాపురం కాలనీ, గొత్తికోయల గుంపు గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి షామిని ఆధ్వర్యాన 36 మందికి పరీక్షలు చేసిమందుల అందజేశారు. నలుగురు జ్వర పీడితులకు రక్తపరీక్షలు చేయగా మలేరియా జ్వరాలు నిర్ధారణ కాలేదని ఆమె తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీరా వెంకటేశ్వరరావు, ఎంటీఎస్ విజయరెడ్డి, ఏఎన్‌ఎం రాధాబాయి, సిబ్బంది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన

దుమ్ముగూడెం: గిరిజన విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలపై నిర్మాణ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. ఈసందర్భంగా మండలంలోని రామచంద్రునిపేట బాలికల ఆశ్రమ పాఠశాల, కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలల్లో శుక్రవారం నిర్మాణ ఆర్గనైజేషన్ సీనియర్ కౌన్సిలర్ కళింగ ఆధ్వర్యాన సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. అలాగే, విద్యార్థినులకు కరదీపికలు అందజేశారు. హెచ్‌ఎంలు వీరమ్మ, మోతీర్, ఉపాధ్యాయులు ఎం.సాయిబాబా, స్టీఫెన్ శంకర్, ఏ ప్రతాప్, కోటయ్య, ఎం.పీ.నాయక్, మాలోత్ ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రై డే.. డ్రై డే

మణుగూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం ఫ్రై డే.. డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటితో ఎదురయ్యే అనర్థాలు, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, నాగజ్యోతి, ఏ.వీ. జ్యోతిలక్ష్మి, విజయకుమారి,వినయ్‌బాబు,భవాని పాల్గొన్నారు.

ఐఆర్‌ఎస్ ఆధ్వర్యాన..

దుమ్ముగూడెం: మండలంలోని బి కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(ఐఆర్‌ఎస్) ఆధ్వర్యాన శుక్రవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మందపాటి సుధాకర్‌రెడ్డి మాట్లాడగా, సర్పంచ్ వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ బాధ్యులు ఎస్ఎల్.కాంతారావు, జి.రాజారెడ్డి, డాక్టర్ భానుప్రసాద్‌తో పాటు నోముల రామిరెడ్డి, రాజారెడ్డి, లక్ష్మణరావు తదితరులుపాల్గొన్నారు.

సభకు తరలిరావాలి


మాట్లాడుతున్న తాటి వెంకటేశ్వర్లు

చంద్రుగొండ/చర్ల: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈనెల 17వ తేదీన జరగనున్న కాంగ్రెస్ విజయభేరి సభకు నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పీసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. చంద్రుగొండ మండలంలోని మద్దుకూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో వెంకటేశ్వర్లు, చర్లలో జరిగిన సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఈ సమావేశాల్లో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ జి.బాబుతో పాటు వనమా గాంధీ, నల్లమోతు రమణ, సంకా కృపాకర్, ఇనుముల రాంబాబు, కేశబోయిన నర్సింహారావు, కృష్ణ, టి.సురేష్, బొర్రా సురేష్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం

మణుగూరు రూరల్: మండలంలోని పగిడేరు గ్రామపంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన కుంజా పుల్లయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు బీఆర్‌ఎస్ నాయకులు బుద్ధరాజు నవీన్‌బాబు తదితరులు ఆయన ఇంటికి వెళ్లి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు వల్లభనేని రమణ, పప్పుల ప్రసాద్, రాము, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే..

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సందర్భంగా నిర్వహించే ఇంజనీర్స్ డే వేడుకలను శుక్రవారం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటాలకు నాయకులు, పలు సంఘాల బాధ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురి ఇంజనీరింగ్ అధికారులను సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరు రూరల్ : ఏడీఈను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు


ములకలపల్లి: అధికారులను సత్కరిస్తున్న దృశ్యం


భద్రాచలంటౌన్: సరస్వతి శిశు మందిర్‌లో ..

వార్షికోత్సవ సభను జయప్రదం చేయండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో వీర తెలంగాణ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ ఆదివారం జరగనుంది. ఈమేరకు సభను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. పట్టణంలోని జగదీష్ కాలనీ, తదితర కాలనీల్లో పర్యటించగా, చాకలి ఐలమ్మ చిత్రపటానికి నాయకురాలు రత్నం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకురాలు కె.సత్య మాట్లాడగా ఎస్.లక్ష్మి, నాగమణి, ఉమాదేవి, రాజేశ్వరి, మంగ, షకీరా, శాంత, దర్గాబీ పాల్గొన్నారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: కొంతకాలంగా భార్యను వేధిస్తున్న వ్యక్తి శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వినాయకపురానికి చెందిన బోగి వెంకటేశ్వరరావు తన భార్య చిలకమ్మను కొద్ది నెలలుగా మానసికంగా వేధిస్తూ, భౌతికి దాడికి పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

గుండాల: అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించేందుకు వస్తున్న ఏసీడీపీఓ కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ప్రమాదం తప్పింది. ఆళ్లపల్లి మండలంలో పనిచేస్తున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ విజయకుమారి తన సొంత కారులో గురువారం ఆళ్లపల్లి నుంచి మర్కోడు వెళ్తున్నారు. మార్గమధ్యలో తునికిబండల గ్రామం వద్ద అదుపుతప్పి రోడ్డు కారు పక్కన గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా, అంగన్‌వాడీ ఉద్యోగులు వారం రోజులుగా సమ్మె చేస్తుండడంతో కేంద్రాలను తెరిపించేందుకు ఆమె వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

అర్హులందరికీ 'బీసీ బంధు' ఇవ్వాలి

దుమ్ముగూడెం: మండలంలో అర్హులైన ప్రతీ బీసీకి 'బీసీ బంధు'పథకం వర్తింపజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని డబ్ల్యూఎల్ రేగుబల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి ద్వారా ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో బీసీ బంధు మంజూరు చేయాలని కోరారు. ఈసమావేశంలో బి.కృష్ణవేణి, నిర్మల, ఎస్.కే.నజీర్, రమాదేవి, ఎస్.కే.నజీమా, లక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు

దుమ్ముగూడెం: పోలీస్‌స్టేషన్ పరిసర గ్రామమైన లక్ష్మీనగరంలో శుక్రవారం ఉదయం ఎస్ఐ పడాల కేశవరావు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో ఉంటున్న వారి వివరాలుదారా తీసిన ఆయన అసాంఘిక శక్తులు, కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని, అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుళ్లు పృథ్వీ, హన్మంతు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలు కొనసాగించాలి

ములకలపల్లి: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీరతెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సూచించారు. మండలంలోని ఒడ్డు రామవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, పద్దం తిరుపతమ్మ, పాయం అమల, కారం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వాలని వినతి

మణుగూరు రూరల్: సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులందరికీ సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు అందజేయాలని ఇఫ్టూ నాయకులు కోరారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక పీ.వీ.కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పీఎంపీఎఫ్ కమిషనర్ కనకమ్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా మాట్లాడుతూ చనిపోయిన, అనారోగ్యంతో పనిమానేసిన కార్మికులకు పీఎఫ్ సొమ్ము త్వరగా చెల్లించడంతో పాటు కొత్త వారికి నంబర్లు కేటాయించాలని కోరారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్‌తో పాటు హతీరాం, కె.నాగేశ్వరరావు, గోపి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'ఔట్ సోర్సింగ్' ప్రతిపాదనలు విరమించుకోవాలి

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల్లోని డెయిలీ వేజ్ వర్కర్లను ఔట్ సోర్సింగ్‌లోకి మార్చాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల డెయిలీ వేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. భద్రాచలంలో శుక్రవారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్కర్ల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడకపోతే సమ్మెకు దిగుతామని చెప్పారు. కౌసల్య, అబ్బులు, జలేందర్, ముసలయ్య, తిరుపతమ్మ, పాపారావు, నాగమణి, స్వరూప, భద్రమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధు

ఒంటరి మహిళలకు చేయూత


మహిళలకు సామగ్రి అందజేస్తున్న దీపక్

అశ్వాపురం: ఐటీసీ బంగారు భవిష్యత్ బంధన్ సంస్థ ఆధ్వర్యాన నిరుపేద ఒంటరి మహిళలకు చేయూతనందించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 24 మందికి రూ.8,400 చొప్పున రూ.2,01,600తో విలువైన వస్తువులు అందజేశారు. ఒంటరి మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు వీటిని అందజేసినట్లు బంధన్ ప్రోగ్రాం ఆఫీసర్ దీపక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గారం సర్పంచ్ సున్నం రాంబాబుతో పాటు ఉత్తం మరిజిత్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

ములకలపల్లి: మహిళా సాధికారత కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో బూరుగుపల్లి పద్మశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సున్నం నాగమణి, నాయకులు తాండ్ర ప్రభాకర్‌రావు, పుష్పాల హన్మంతు, పామర్తి కృష్ణ, పొదలి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పునర్‌విముక్తి ప్రతిజ్ఞాదినంగా నిర్వహించాలి

బూర్గంపాడు: ఈనెల 17వ తేదీన తెలంగాణ పునర్ విముక్తి ప్రతిజ్ఞ దినంగా నిర్వహించాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కే.వీ.రమణ అన్నారు. గడప గడపకు బీఎస్పీ కార్యక్రమంలో భాగంగా మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ ఆధిపత్య దోపిడీ పార్టీలు విమోచన, విలీన, విద్రోహ, సమైక్యతా దినాలుగా ఎవరి అవకాశం వచ్చినట్లు వారు నిర్వహిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు బహుజనమంతా తెలంగాణ పునర్‌విముక్తి ప్రతిజ్ఞ దినంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడిద దామోదర్, నల్లగట్ల రఘు, కేసుపాక కృష్ణ, పీక మల్లేష్, జబ్బ కృష్ణ, పాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణ చేపట్టాలి


దమ్మపేట: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీల వర్గీలకరణ బిల్లును ఆమోదించాలనే డిమాండ్‌తో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ దీక్ష శిబిరంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు కోలికపోగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఆమోదించాలని డిమాండ్ చేశారు. నాయకులు కోలికపోగు కాంతారావు, రాయల పుల్లారావు, రావూరి వీరయ్య, కోలికపోగు ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి..

అశ్వారావుపేటరూరల్: యువత బలోపేతమైతేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని.. కానీ ప్రస్తుత పాలకులు యువతను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పీవైఎల్ జిల్లా కార్యదర్శి నూపా భాస్కర్ విమర్శించారు. మండలంలోని కావడిగుండ్లలో శుక్రవారం సమావేశంలో ఆయన పీవైఎల్ జెండా ఎగురవేసి మాట్లాడారు. అనంతరం పీవైఎల్ డివిజన్ కమిటీను ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా కాక వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కొర్సా రామకృష్ణతో ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోగా, నాయకులు కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, లక్ష్మణ్, పండా ముత్యాలరావు, అర్జున్ పాల్గొన్నారు.

రూ.5 కోట్ల నిధులకే సంబరాలా?

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కేవలం రూ.5కోట్లు విడుదల చేయగానే బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు చేసుకోవడం గర్హనీయమని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 కోట్లతో సీసీ రోడ్డు, సరైన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేమని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రకటించిన రూ.100 కోట్లు, వరద పునరావాసానికి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లను విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, ప్రదీప్, వెంకటేష్, సుధీర్, రాము, శ్రీనివాస్, రాజేశ్వరి, సరిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్